విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 10 జనవరి 2025 8 పేజీలు



పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కాకినాడలో సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఇళ్లులేని ▶మిగతా 2లో..

మళ్లీ... త్రిసభ్య కమిటీలే...!

- త్రీ మెన్ కమిటీలకే కూటమి ప్రభుత్వం మొగ్గు
- ప్రజా ప్రతినిధుల చుట్టూ నేతల ప్రదక్షిణలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: సహకార సంఘాల ఎన్నికలకు పట్టిన గ్రహణం ఇప్పుడే వీడేటట్లు కనిపించడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 2013లో ఎన్నికలు జరిగాయి. 2014లో రాష్ట్ర విభజన అనంతరం టిడిపి అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల పాలక వర్గాల సమయం 2018లో ముగిసింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ కూడా సహకార ఎన్నికలు నిర్వహించలేదు. కేంద్ర ప్రభుత్వం సహకార సంస్కరణలు తీసుకువస్తుందన్న నెపంతో తమ పార్టీ నాయకులతో కూడిన త్రిసభ్య కమిటీలను సహకార సంఘాలకు ఏర్పాటు చేసింది. 2019 నుంచి 2026 వరకు ఆ త్రిసభ్య కమిటీలే కొద్దిపాటి మార్పులతో సహకార సంఘాల పరిపాలన చేశాయి. దాదాపు ఆరు సంవత్సరాలు గడిచాయి.వైసీపీ నేతల పరిపాలనలో సహకార సంఘాల పనితీరు మందగించిందన్న ఆరోపణలు వచ్చాయి. 2024లో మళ్లీ టిడిపి, బిజెపి, జనసేన లకు చెందిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను రద్దుచేసి వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. సహకార శాఖకు చెందిన పలువురు అధికారులు సొసైటీలకు ప్రత్యేక అధికారులుగా నియమింప బడగా జిల్లా స్థాయి కేంద్ర సహకార బ్యాంకుకు, డిసిఎంఎస్, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారు.

ఎన్నికల ఏర్పాట్లు... త్రిసభ్య కమిటీలు

సహకార సంఘాలు ప్రత్యేక ▶మిగతా 2లో..

ఆరేళ్లుగా వాయిదా పడ్డ సహకార సంఘాల ఎన్నికలు మరో పర్యాయం వాయిదా పడ్డట్టే కనిపిస్తున్నాయి. 2013లో చివరగా ఎన్నికలు జరగగా 2018కి కాలపరిమితి పూర్తయ్యింది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు నామినేటెడ్ కమిటీలతో సరిపెట్టింది. కూటమి అధికారంలోకి వచ్చిన సొసైటీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఎన్నికలు నిర్వహిస్తారు అనుకున్న సమయంలో మళ్లీ త్రిసభ్య కమిటీలు తెరపైకి వచ్చాయి. ఆయా పదవులలో తమ వారిని నియమించుకుని సొసైటీలో తమకు అనుకూలమైన పరిస్థితులు తెచ్చుకున్న తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం ఆలోచనగా భావిస్తుంది.

సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును కలెక్టర్ చదలవాడ నాగరాణి జ్యోతి వెలిగించి ప్రారంభించి, ఖజానా కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంబరాలు సాంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంసించారు. కోలం ముగ్గులను, బొమ్మల కొలువును అలంకరణలను పరిశీలించి చాలా బాగుందని కితాబు ఇచ్చి, ఈ అలంకరణలో పాల్గొన్న మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతి అని, కుటుంబ సభ్యులందరూ పండగ రోజుల్లో ఒక చోట చేరి ఆనందోత్సాహాలతో సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. బుద్ధిని వృద్ధి చేసుకోవడం అనేది సంక్రాంతి పండుగ లోని ఆంతర్యం అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో తెలుగు సంక్రాతి పండుగను పురస్కరించుకొని గురువారం నుండి మూడు రోజులు పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రంగవల్లులు, పువ్వులతో కార్యాల యాన్ని అలంకరిం చటం, బొమ్మల కొలువు, భోగిమంట, చెరుకు గెడలు, పూర్ణకలశాలు, ధాన్యపు కంకులు, రేగిపళ్ళు మొదలైన వాటితో సంక్రాంతి శోభను తీర్చిదిద్దారు. తొలుత సంక్రాంతి సందర్భంగా వంటలు, ముగ్గులు, క్రీడల పోటీలను నిర్వహించి చివరిగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వేడుకల్లో జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్‌హకీం, ఎస్‌టిఓలు జె. రామారావు, ఇ.హిమ బిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు, ఎ.వి. శివాజీ, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు యు.వి.పాండురంగారావు సీనియర్ అకౌంటెంట్లు జె.మౌనిక, జ్యోతి, పి.వినీల, పి.విశాలి, జి.చంద్ర శేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీ సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ అధికారులు, ఉద్యోగుల ర్యాలీ

విశాలాంధ్ర - రాజానగరం : ప్రయాణికుల సౌకర్యార్థం తమ సంస్థ అందిస్తున్న డోర్ డెలివరీ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిల అశోక అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది,కార్మికులు సంయుక్తంగా కలిసి అవగాహన ర్యాలిని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి షెల్టన్ హొటల్, శీలం నూకరాజు కాంప్లెక్స్, జాగృతి బ్లడ్ బ్యాంక్, రామాల యం, పాత సోమాలమ్మ గుడి మీదుగా రాజమహేంద్రవరం కాంప్లెక్స్‌కు చేరుకున్న ఈ ర్యాలీలో ప్లకార్డులను చేతపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిపిటీవో షర్మిల అశోక మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ నేతృత్వంలో గత నెల 20 నుండి జనవరి 19వ తేదీ వరకు ఏపీఎస్ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏపీలో 80 ముఖ్య పట్టణాలలోని డిపో పరిధిలోని 10 కిలోమీటర్ల వరకు 50 కేజీల వరకు పార్సెల్ లను మీ ఇంటి వద్దకే చేరవేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్.కె షబ్నం మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీకి ఆదరణ పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఏటీఎం (కమర్షియల్) కె.మాధవ,ఆర్టీసీ ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ, ఆఫీస్, సింగు సొల్యూషన్స్ సిబ్బంది, హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు కచ్చితంగా పాటించాలి

- కోడి పందేలను, జూద క్రీడలను అడ్డుకోండి
- సంక్రాంతి పేరిట జంతుహింస జరుగకుండా చూడాలి : కలెక్టర్

విశాలాంధ్ర -ఏలూరు: సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జంతుహింస జరుగకుండా నియంత్రణా చర్యలు చేపట్టాలని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలో రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జూదాలు జరుగకుండా చూసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గట్టి నిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ కమిటీల్లో ఆయా మండల తహశీల్దారు, ఎస్ హెచ్ఓ, ఎన్ జివో ప్రతినిధి, ఇద్దరు కానిస్టేబుల్స్, ఇద్దరు వీడియో గ్రాఫర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. ఈ సమన్వయ కమిటీలు ప్రజల్లో కోడిపందేలు నియంత్రణపై అవగాహన కల్పిస్తారు. కోడిపందేలతోపాటు ఇతర నిషిద్ధ ఆటలను ఆడటాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. సంయుక్త తనిఖీ బృందాలు నిర్వర్తించాల్సిన విధి విధానాలను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మన సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

విశాలాంధ్ర-ఉండి : మన సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో సన్ రైజ్ ఫౌండేషన్

వృద్ధాశ్రమంలో గురువారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముదునూరి ధృవ్ నిశ్చయ్ వర్మ పుట్టినరోజును పురస్కరించుకొని దుప్పట్లు, తువ్వాళ్లు, గలేబులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవాస భారతీయులైన మోహన్‌కృష్ణ, రేవతి దంపతుల తనయుడు వర్మ పెద్దల దీవెనలు పొందటం, పుట్టినరోజు వేడుకలు వృద్ధుల మధ్య జరుపుకోవటం అభినందనీయం అన్నారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ అమెరికాలో నివసిస్తున్న శివ మాస్టార్ మనవడు ఇలా వృద్ధుల మధ్య గడపటం ఒక మధురానుభూతి అన్నారు. వర్మ తండ్రి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ఇంత మంది పెద్దల మధ్యలో తన కుమారుడు బర్త్‌డే చేసుకునే అదృష్టం కల్గినందుకు చాలా సంతోషం అన్నారు. క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ తన మనవడు వర్మకు ఆశీస్సులు అందజేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వృద్ధులకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలతీర్థపు నరసింగరావు, ముదునూరి మోహన్‌కృష్ణ రేవతి, ముదునూరి ధృవ్ నిశ్చయ్‌వర్మ, వృద్ధాశ్రమ నిర్వాహకులు వాణి హరిప్రియ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: ఈదర మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యా యుడు మక్కె వేణుగోపాలరావు సంక్రాంతి సంబరా లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి పిల్లలకు, పాఠశాలలోని విద్యార్థు లకు తలపై భోగి పండ్లను పోశారు. అనంతరం పొంగలి, పులిహోర శు భదివ్ భోజనాన్ని విద్యార్థు లకు అందించారు. ఈ

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.నిర్మలాదేవి, అంగన్వాడి టీచర్ దిడ్డి సునీత, అనసూర్య, పూజిత, రంగమ్మ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు.

యద్దనపూడి స్మారక అవార్డు ఎంట్రీలకు ఆహ్వానం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : సుప్రసిద్ధ సంఘ సేవకుడు, ప్రముఖ పాత్రికేయుడు యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు - 2024 కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డ్ ఎంపిక కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 2024 జనవరి 1 నుండి 2024 డిసెంబర్ 31 వరకూ ఏడాది పొడువునా ప్రచురితమైన ప్రత్యేక వార్తలు, ప్రత్యేక కథనాలు , విశ్లేషణలు, మానవీయ కథనాలు, ఎంట్రీలుగా పంపవచ్చునన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని పాత్రికేయులు ఈ అవార్డుకు తమ ఎంట్రీలను పంపాలని కమిటీ ఆ ప్రకటనలో కోరింది. ఆయా వార్తా కథనాల ఫోటో కాపీలను, కవరింగ్ లెటర్‌తో జనవరి 25వ తేదీ లోగా యద్దనపూడి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ఎంపిక కమిటీ కన్వీనర్ డి. సోమసుందర్ , కడకట్ల రోడ్, 31 వ వార్డు , తాడేపల్లిగూడెం 534101, చిరునామాకు పంపాలని వివరాలకు 9866074026 నంబరులో సంప్రదించవచ్చు నని కమిటీ తెలిపింది. జనవరి 31న తాడేపల్లిగూడెంలో యద్దనపూడి సూర్యనారాయణమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసే కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరుగు తుందని, అవార్డు గ్రహీతను రూ.5,116లు నగదు పారితోషి కం, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారని కమిటీ తెలిపింది.

వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన తహసీల్దార్లకు ర్యాంకింగ్‌లు

విశాలాంధ్ర-ఏలూరు: గత నవంబరులో జరిగిన రెవిన్యూ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పేర్కొన్న విధంగా రెవిన్యూకు సంబంధించి వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచినవారికి ర్యాంకింగ్ లను ప్రకటించారు. ఇందులో మొదటి ర్యాంక్ భీమడోలు తహశీల్దారు రమాదేవి సాధించగా చింతలపూడి,పెదపాడు మండల తహశీల్దార్లు ప్రమద్వార, కృష్ణజ్యోతి ద్వితీయ,తృతీయ ర్యాంకులను సాధించారు.ఈ సందర్భంగా మొదటి ర్యాంకు సాధించిన భీమడోలు తహశీల్దారు బి. రమాదేవికి బెస్ట్ పెర్ఫార్మింగ్, మెమెంటో అందించి శాలువతో కలెక్టర్ వెట్రిసెల్వి సత్కరించారు.

ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పి. కిరణ్మయి అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అన్ని సచివాలయాల నుండి వచ్చిన మొదట, 'రెండవ గర్భిణీలు 74 మందికి వైద్యాధికారి పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి గర్భిణీ తప్పని సరిగా 4 సార్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గణపవరంలో పరీక్షలు చేయించుకోవా లని, మంచి పోషక విలువలు కలిగిన పదార్థాలను

తీసుకోవాలని ఐరన్ మాత్రలు, కాల్షియం బిళ్లలు ,వాడలని పౌష్టికాహారం తీసుకోవాలని ఆకుకూరలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జె. విల్సన్ బాబు, హెచ్‌వి పద్మజ, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక బస్తాలు వేసి గండి పూడ్చివేత

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నాచుగుంట అండర్ టన్నెల్ వద్ద (ఏలూరు కాల్వకు) గండి పడిన ప్రదేశాన్ని తాడేపల్లిగూడెం వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ రెడ్డి శివ పరిశీలించారు. గురువారం గండి ప్రదేశం వద్ద ఇసుక బస్తాలు వేసి నివారణ చర్యలు చేపట్టారు. తక్షణమే స్పందించిన డిస్ట్రిబ్యూటర్ చైర్మన్‌కు అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

త్రిసభ్య కమిటీలే

(1వ పేజీ తరువాయి)

అధికారుల పాలనలోకి రావడంతో ప్రభుత్వ సూచనలతో సంఘాల పనితీరుపై దృష్టి సారించారు. ఓటర్ల జాబితా సిద్ధం చేసే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. యాక్టివ్‌గా లేని సభ్యులను తొలగించడం, నిబంధన ప్రకారం ఓటు హక్కు వచ్చే సభ్యుల జాబితా తయారు చేయడంలో తల మునకలై ఉండడం జరిగింది. వీరికి సంబంధించి ఈ కేవైసీ బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించడంతో వారు ఆ పని పూర్తి చేస్తున్నారు. దీంతో త్వరలోనే సహకార ఎన్నికలు నిర్వహిస్తారన్న అభిప్రాయం అందరి లోనూ ఏర్పడింది. అంతలోనే ప్రభుత్వం నిర్ణయం మార్చుకున్నట్లు తెలుస్తోంది. మళ్లీ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లే త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం.

తమకు అనుకూలంగా మార్చుకునేందుకే...

ప్రత్యేక అధికారుల పాలనలో పక్కాగా ఓటర్ల జాబితాలు తయారవుతున్నాయి. సహకార సంఘాల ఎన్నికలలోనూ నూటికి నూరు శాతం విజయం సాధించాలన్న అభిప్రాయంతో కూటమి ప్రభుత్వం ముందుకెళుతోంది.ప్రత్యేక అధికారుల అజమాయిషీలో ఉంటే ఓటర్ల జాబితాలో మార్పులు,చేర్పులు చేయలేమని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తమ పార్టీ నేతలతో త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేస్తే వారి చెప్పుచేతలలోకి సంఘాలు వస్తాయి. ఓటర్ల జాబితాలో తమకు అనుకూలమైన మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలవుతుందని, తద్వారా ఎన్నికలు నిర్వహించి నూటికి నూరు శాతం ఫలితాలు,విజయవంతంగా సాధించేందుకు వీలవుతుందని కూటమి ప్రభుత్వ నేతలు భావిస్తున్నారు. త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేస్తారన్న సమాచారంతో పలువురు మండల స్థాయి, గ్రామస్థాయి నేతలు తమ తమ ఏరియాలలో ఉన్న సహకార సంఘాలలో అధ్యక్ష,సభ్యులకు ఆశిస్తూ ద్వితీయ శ్రేణి నేతలు ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మొత్తం మీద మళ్లీ త్రిసభ్య కమిటీల నియమాకంతో సహకార ఎన్నికలు వాయిదా పడినట్లేనని భావిస్తుండగా, ప్రభుత్వ నిర్ణయం ప్రకారం తమ కార్యాచరణ ఉంటుందని జిల్లా సహకార శాఖ అధికారులు తెలియజేశారు.

స్థలాలు ఇవ్వాలి

(1వ పేజీ తరువాయి)

నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఇళ్ల స్థలాలకు అర్జీలు సమర్పిం చారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న నివేశన స్థలాల లబ్ధిదారులకు పట్టణాల్లో సెంటుకు బదులుగా రెండు సెంట్లు, గ్రామాల్లో సెంటున్నరకు బదులు మూడు సెంట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నెరవేర్చాలని కోరారు. గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాల భూ సేకరణలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వచ్చే నెలలో కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాక పోతే ఇళ్ల స్థలాల సాధన సమితి ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో బ్రతుకుతున్న పేదలు అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి సత్వరమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కోరుతూ దశలవారీ ఆందోళనలు చేపడతామని మధు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఐ నాయకులు ఎంఎస్ నారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు... రైతుల్లో ఆనందం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో సక్రమంగా జరిగాయని మండల తెలుగు రైతు అధ్యక్షులు బొల్లిన పుల్లా రావు తెలిపారు. రంగా పురంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధాన్యం రైతులు పడిన కష్టాలు అన్నీ, ఇన్నీ కావన్నారు. అటువంటి పరిస్థితులు లేకుండా కూటమి ప్రభుత్వం పగడ్బందీగా కొనుగోళ్లు చేయించడంవల్ల రైతులు ఆనందంగా ఉన్నారని అన్నారు. ఏ

రైతుకు బకాయి లేకుండా డబ్బు చెల్లించిందని తెలిపారు. మండలంలోని అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేయటంతో సక్రమంగా ధాన్యం కొనుగోలు జరిగిందని దీనికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలం నుంచి 11,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, దాదాపు 1800 మంది రైతులకు రూ.27 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేయటం వల్ల రైతు లంతా సంక్రాంతి సీజన్లో ఆనందంతో ఉన్నారని వెల్లడించారు.

కిరాయి రవాణా చార్జీలు జమ చేయండి

విశాలాంధ్ర-ఉండి : రైతు సేవా కేంద్రం ద్వారా ఖరీఫ్ ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా కిరాయి రవాణా చార్జీలు నేటికీ జమ కాలేదని ఎండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పీవీఎస్ గోపాలకృష్ణంరాజు విమర్శించారు. కిరాయి రవాణా చార్జీలు జమ చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో 528 మంది రైతులు 3,0 33 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు సేవా కేంద్రం ద్వారా విక్రయించారని తెలిపారు. ఆయా రైతులకు నేటికీ కిరాయి రవాణా చార్జీలు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రవాణా చార్జీలు తక్షణమే జమ అయ్యేటట్లు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

గర్భిణులకు ఉచితంగా మందులు

విశాలాంధ్ర-కాళ్ళ : కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని గర్భిణీలకు డాక్టర్ సరాబు సునీల్, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులు ఇచ్చి తగిన సూచ నలు, సల హాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం శుక్రవారం కూడా నిర్వహిస్తామని డాక్టర్ సునీల్ తెలిపారు. ఈ కార్య క్రమంలో ఉచితంగా మందులతో పాటు శ్రీ దత్త పాదుక క్షేత్రం ఎస్ డి

హెచ్.ఎస్ వాలంటీర్ తరపున కాళ్ళ గ్రామ టీం లీడర్ పివి నాగేశ్వరరావు సౌజన్యంతో గర్భిణీలకు వారితో వచ్చిన సహాయకులకు, రోగులకు 70 మందికి పౌష్టికాహారంతో కూడిన భోజనాలు ఏర్పాటు చేశారు. దేవుని సన్నిధి సహవాసం కువైట్ వారి ఆధ్వర్యంలో గునుపూడి సుశీల, రాపాక గణపతి సహకారంతో రోగులకు, గర్భిణీలకు పండ్లు, దుప్పట్లు అందించారని తెలియజేసారు.

విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులకు బాల్యం నుండి మన సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయాలని బండివారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు డి.బాజా తెలిపారు. స్థానిక

పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలలో భాగంగా విద్యార్థిను లకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి గ్రామానికి చెందిన నాళం నారాయణరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందించిన రూ.3 వేల నగదును విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ సంస్కృతి, సాంప్రదాయా ల పై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీలపై కఠిన చర్యలు -మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర -భీమవరం: పట్టణ పరిధిలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు, స్వీట్ షాప్స్, బేకరీ యజమానులు ఆహారం, తినుబండారాలను నాణ్యత ప్రమాణాల ప్రకారం తయారు చెయ్యకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారగడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో పలు హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కనీస నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించకుండా నిలువ చేసిన ఆహార పదార్థాలు వాడటం, నిషేధించిన రసాయన రంగులను, కుళ్ళిన మాంసం, చేపలు, రొయ్యలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పరిశుభ్రత పురపాలక చట్టం 1965, ప్రజా ఆరోగ్య చట్టం 1939, ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2006 లో ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని ఆయన తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

టెలికం సలహా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. ఏలూరు నగరంలోని జీఎన్టీ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ భవన్ లో గురువారం జరిగిన టెలికం సలహా కమిటీ

సమావేశానికి ఎంపీ మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను జనరల్ మేనేజర్ శ్రీను వివరించారు. అనంతరం ఎంపీ మహేష్ పార్లమెంట్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం నియోజకవర్గంలో కొత్త టవర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. సిబ్బంది కొరత వల్ల కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయని బిఎస్ఎన్ఎల్ జిఎం శ్రీను ఎంపీ మహేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల ఖాళీల వివరాలు, ఇతరత్రా సమస్యలు తనకు నివేదిక రూపంలో అందిస్తే కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కొత్త టవర్ల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సలహా కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని ఎంపీ సూచించారు. అనంతరం బిఎస్ ఎన్ఎల్ అధికారులు, కమిటీ సభ్యులు ఎంపీ మహేష్‌కు పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సమావేశానికి సలహా కమిటీ సభ్యులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు హాజరయ్యారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు

విశాలాంధ్ర-వీరవాసరం: శ్రీ కృష్ణ దేవరాయ నాటక కళాపరిషత్ పంచమ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు మండలంలోని రాయకుదురులో మంతెన ప్రసాద్ వాటర్ ప్లాంట్ ప్రాంగణంలో 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షులు కేవీఎస్ఆర్కే గోపాలకృష్ణ, కార్యదర్శి డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ (రాజు) గురువారం తెలిపారు.

నేటి రాత్రి 8 గంటలకు మొదటి ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం' నాటిక, రెండవ ప్రదర్శనగా శిరిడి సాయి కల్చరల్ ఆర్ట్స్, అనకాపల్లి వారి మలిసంధ్య నాటిక, 11వ తేదీ మొదటి ప్రదర్శనగా నటీనట సమాఖ్య, పాలకొల్లు వారి అనూహ్యం నాటిక, రెండవ ప్రదర్శనగా శర్వాణి ఫైన్ ఆర్ట్స్, బురివంక వారి కొత్త పరిమళం నాటిక, 12వ తేదీ రాత్రి 7 గంటలకు అరవింద, తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటిక, రెండవ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం ఆ సత్యం నాటిక ప్రదర్శించడం జరుగుతుందని వివరించారు.

న్యాయవాదుల సంక్షేమానికి ఐఎల్ఎల్ కృషి

విశాలాంధ్ర-ఏలూరు: న్యాయవాదుల సంక్షేమం కోసం నిరంతరం ఐ.ఎ.ఎల్. కృషి చేస్తుందని ఐఏఎల్ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు,నగర నాయకులు వాకాడ రాజారావు, పిఎస్ చందు అన్నారు. ఏలూరులో గురువారం ఇండియన్ అసోసియే షన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) 2025 డైరీని స్ఫూర్తి భవనంలో ఐఏఎల్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ ఏలూరు జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు నగర ఐఏఎల్ నాయకులు వాకాడ రాజారావు, పిఎస్ చందు మాట్లాడుతూ ఐఏఎల్ ఏర్పడిన నాటి నుండి దేశంలో, రాష్ట్రంలో, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో న్యాయవాదుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుంద న్నారు. న్యాయవాదులపై జరుగుతున్న భౌతిక దాడులను ఖండిస్తూ, వాటికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ న్యాయ వాదులకు రక్షణగా ఐఏఎల్ నిలబడు తుందని వారు తెలిపారు. న్యాయవాదుల వెల్ఫేర్ బోర్డు ద్వారా న్యాయవాదులకు ఇప్పుడు అందిస్తున్న సౌకర్యాలకు అదనంగా మరిన్ని సౌకర్యాల కోసం, రాయితీల కోసం ఐఏఎల్ మిగతా న్యాయవాదుల సంఘాలతో కలిసి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. న్యాయ వాదుల అభ్యున్నతి కోసం వారి అభివృద్ధి కోసం నిత్యం

పనిచేస్తున్న ఐఏఎల్ బలోపేతానికి న్యాయవాదులు ఐ.ఏ.ఎల్.లో సభ్యులుగా చేరాలని వారు విజ్ఞప్తి చేశారు. 2005 ఐఏఎల్ డైరీ ఆవిష్కరణలో న్యాయవాదులు పిపి శాస్త్రి, విశ్రాంతి జడ్జి ఎ. లక్ష్మి, న్యాయవాదులు రాజనాల రామ్మోహనరావు, చిక్కా భీమేశ్వర రావు, పివి రత్నం, బలగం బాలాజీ, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసడాంగే, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎ. అప్పల రాజు, బి. శ్రీనివాసరావు, ఏ.ఐ. ఎస్.ఎఫ్. నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలివ్వాలి-సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదు ర్కొంటున్న నిరు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ సచివాలయం వద్ద ఆందో ళన నిర్వహించి సచివాలయ కార్యదర్శి డి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం

ఇచ్చిన జగనన్న నివేశన స్థలాల లబ్ధిదారులకు పట్టణాల్లో సెంటుకు బదులుగా రెండు సెంట్లు, గ్రామాల్లో సెంటున్నరకు బదులు మూడు సెంట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నెరవేర్చాలని కోరారు. గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మీపతి, గణపతి, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులు అర్హులైన ప్రతివారు పొందేలాగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ క్షేత్రసహాయకులు కృషిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వి.ఆర్. కృష్ణతేజ తెలిపారు. గురువారం స్థానిక క్రాంతి కళ్యాణ మండపంలో జిల్లాస్థాయి ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ క్షేత్రసహాయకుల శిక్షణా కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే ఉపాధిపనులకు అర్హులైన ప్రతి వారికి పనికల్పించే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ పథకాన్ని క్షేత్ర సహాయకుల పనులు గ్రామంలో ఎంతగానో ప్రాముఖ్యతను సంచరించు కుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ ద్వారా రూ. 4,500 కోట్లుతో 3,500 కిలోమీటర్ల మేర సిసి రోడ్లు,బిటి రోడ్లు, మరమ్మతులను చేపట్టడం జరిగిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ముఖ్య

ఉద్దేశం ప్రతి కూలీకి రూ. 300 వేతనం పొందే లాగా ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్వహించా లని అన్నారు. ఈ సమావేశంలో ఈజీఎస్ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి డైరెక్టర్ వైవీ షణ్ముఖ కుమార్,ఎడిషనల్ కమిషనర్ పంచాయతీరాజ్ మల్లెల శివప్రసాద్, ఏలూరు ప్రాజెక్టు డైరెక్టర్ డోమ కె. వెంకట సుబ్బారావు, జడ్పీ సీఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖజానాను లూటీ చేసిన వైసీపీ

ఎంపీ మహేష్ విమర్శ

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను లూటీ చేసిందని, ఐదేళ్లు ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం 32 మంది

లబ్ధిదారులకు మంజూరు చేసిన రూ.63 లక్షల చెక్కులను గురువారం ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ మహేష్ పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మహేష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. ఫలితంగా నేడు రాష్ట్రంలో నిధుల లేమి కారణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అవరోధంగా మారిందన్నారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఎంపీ చెప్పారు. స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్కులు వస్తున్నాయని, ప్రభుత్వ భూములతో పని లేకుండా ప్రైవేట్ భూములను పారిశ్రామిక వేత్తలే కొనుగోలు చేసి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చేవారిని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జాతీయ రహ దారులు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, నూతన రైల్వే స్టేషన్ల మంజూరు వంటి అభివృద్ధి పనులపై దృష్టి సారించినట్లు ఎంపీ స్పష్టం చేశారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల నియంత్రణకు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఇటీవల కేంద్రమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-వీరవాసరం: రాబోయే సంక్రాంతి పండుగకు ప్రజలు ఎలాంటి జూద క్రీడలు, కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహించొద్దని, నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూదాలకు దూరంగా ఉండాలని, సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయ క్రీడలు, రంగవల్లుల పోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎస్ఐ ఎం.రాజ్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చట్ట రీత్యా శిక్ష తప్పవని హెచ్చరిం చారు. కోడి పందేలను కట్టడి చేసేలా 36 మందిపై బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

అతివల చదువు అవనికి వెలుగు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అమ్మాయి చదువు అవనికి వెలుగునిస్తుందని చాటిచెప్పిన సంఘసంస్కర్త విద్యావేత్త, సామాజిక కార్యకర్త, తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయిని షేక్ ఫాతిమా అని బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెగల దుర్గారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ

బాలుర హైస్కూల్లో జరిగిన ఫాతిమా 194వ జయంతి కార్యక్రమంలో దుర్గారావు మాట్లాడుతూ బాలికల విద్య కోసం విశేష కృషి చేసిన ఫాతిమా, చరిత్రను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు. అనంతరం ఆ పాఠశాలలోని ముస్లిం మహిళా ఉపాధ్యాయులైన షేక్ రేష్మ, షేక్ వహీదాలను సన్మానించి, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, కొయ్యలగూడెం సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, వంది ప్రభుదాసు, సూరి గంగాధర్ రాజు, గెద్దం రాంబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేద రోగులకు వరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడు తుందని టీడీపీ మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ పేర్కొన్నారు. మండలంలో పొంగు టూరు, చొప్పరమన్న గూడెం గ్రామాలకు చెందిన మర్రి శామ్యూల్, నల్లూరి మౌనిక లకు జిల్లా కేంద్రమైన ఏలూరులో ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేష్ కుమార్ కార్యాలయం వద్ద ఆయన చేతులమీదుగా 1,20,000 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసినట్లు నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొంగుటూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రగడ రమేష్, మద్దుకూరి కృష్ణ, గూడపాటి శేఖర్, నల్లూరి గోపి, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బయ్యనగూడెం పి హెచ్ సి పరిధిలో బయ్యనగూడెం గ్రామంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 18సంవత్సరములు దాటిన వారందరికీ రక్తపోటు, మధు మేహం, క్యాన్సర్ పరీ క్షలు నిర్వహిం చడం జరిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లా డుతూ నేటి సమాజంలో అసంక్రమణ వ్యాధులైన బి పి, డయబెటీస్, చాలా ప్రమాదకరంగా పెరుగుతున్నాయని, వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స పొందాలని, ఏ మాత్రం అశ్రద్ధ చేసిన బి.పి వల్ల గుండె పోటు, పక్షవాతంకు గురి అవుతారని, షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోకపోతే కంటి చూపు కోల్పోతారని, కిడ్నీలు పాడవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజార్ బాషా, ఎంయల్‌హెచ్‌పి బి. రవితేజ, ఏఎన్ఎంలు పద్మావతి, నాగమణి, ఆరోగ్య సహాయకులు మోహన్, ఆశా కార్యకర్తలు జగతి, శాంతకుమారి, పద్మ పాల్గొన్నారు.

ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : తెలుగు వాళ్ళు ప్రపంచంలో ఎక్కడున్నా సాంప్రదాయమైన సంక్రాంతి పండుగకు సొంత ఊరికి వచ్చి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్ ఆర్ స్కూల్ జోనల్ ఇంచార్జ్ దేవేందర్ అన్నారు. భీమవరం మండల పరిధి వెంప రోడ్డులోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి కళ ఉట్టిపడేలా సాంప్రదాయ వేషధారణలతో, నృత్యాలతో విద్యార్థిని విద్యార్థులు అలరించగా, తెలుగువారు ఎక్కడ ఉన్న సొంత ఊరికి వచ్చే పండగ కుటుంబ సభ్యులతో జరుపుకోవాలన్న సందేశంతో చిన్నారి వేసిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లేశ్వరి, నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్రాంతికి కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - నిడమర్రు: రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, పేకాట ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వ హిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ బి. దుర్గాప్రసాద్ అన్నారు. గురు వారం నిడమర్రు మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో అవగాహన సదస్సు నిడమర్రులో జరిగింది. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు ఎస్ఐ ఎన్‌వి ప్రసాద్‌రావు, ఎన్. తిరుపతి స్వామి, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టరు చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థులపై తల్లి దండ్రులు కూడా శ్రద్ధ పెట్టాలని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగు కళాశాల సమావేశ మంది రంలో పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరం డివిజన్ స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపా ధ్యాయులతో కలసి పదవ తరగతి పరీక్షా ఫలితాలపై తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై కలెక్టరు చదలవాడ నాగరాణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మార్చి 15వ తేదీన నుండి జరగనున్న పదవ తరగతి పరీక్ష ఫలితాలు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు పశ్చిమ గోదావరి జిల్లాను రాష్ట్రంలోన ప్రథమ స్థానం నిలిచేలా సమిష్టిగా కృషి చేయాలన్నారు. యస్ ఏ -1 పరీక్షలు ఉత్తీర్ణత శాతాన్ని అనుసరించి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. ప్రత్యేక తరగతులు సమర్థవంతంగా నిర్వహించాల న్నారు. సి,డి గ్రేడు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే మరో అరగంట సేపు ఎక్కువగా ప్రత్యేక క్లాసులో ఉంచాలని అన్నారు. ఆడపిల్లల రక్షణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవా లని, వారు ఎటువంటి ఇబ్బందులకు లోను కాకుండా చూడవలసిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే నని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటరు పి.శ్యామ్ సుందర్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వై.చంద్ర శేఖర్, డివైఇవో పి.నాగరాజు, మండల విద్యా శాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో విద్యా సౌకర్యాలుండాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పేదలకు మంచి విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫల మవుతున్నాయని మాజీ మంత్రి, మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ సంయుక్త కిసాన్ మోర్చా సమన్వయ కర్త వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. ధర్మాజీగూడెంలో ఆడియో వీడియో కాలేజీ ఏర్పాటుకు తన వంతు కృషి చేసిన ఈయన గురువారం కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాసంబంధమైన విషయాలపై మాట్లా డుతూ ఆనాటి దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మండల పరిధిలో ఆడియో వీడియో కళాశాలను ఏర్పాటు చేయడం కోసం ఈ గ్రామంలో ప్రయోగా త్మకంగా మొదటి కాలేజీని ఏర్పాటు చేశారని వివరించారు. ఆనాడు ఈ కాలేజీ మంచి ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. కాలేజీ ఏర్పాటుకు గ్రామానికి చెందిన ముసునూరు నాగేశ్వరరావు ఆర్థికంగా ముందుకొచ్చి ఎంతో కృషి చేయ టం వల్ల ప్రభుత్వ కాలేజీ స్థాపన జరిగిందని అన్నారు. దీని ఏర్పాటులో తన భాగస్వామ్యం ఉండటం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం లోనూ, దేశంలోనూ విద్య కష్టతరంగా, ఖరీదుగా మారిందని తన అనుభవాన్ని వివరించారు. సామాన్యులు చదువుకునేం దుకు ఆర్థిక స్తోమత లేక నాణ్యమైన విద్యను అందుకోలేకపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధనవంతులకే విద్య పరిమితమవుతున్నట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వంతులైన వారందరూ మన గ్రామం, మనజిల్లా మనప్రాంతం,మన రాష్ట్రం, మనదేశం అనే ఆలోచనతో ఉండి విద్య అభివృద్ధికి కృషి చేసినప్పుడు విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు సామాన్యులు ఉన్నత చదువులు చదువుకునేం దుకు వీలుగా విద్య వ్యవస్థను తీర్చిదిద్దాలని కోరారు.ధర్మాజీ గూడెంలో ఉన్న కాలేజీకి సొంత భవన నిర్మాణాల కోసం ఆనాటి రాజ్యసభ సభ్యులు ఉపేంద్రతో సంప్రదించి ఆయనకు కేటాయించిన నిధులను ఈ కాలేజీ భవన నిర్మాణానికి కేటాయించేం దుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపల్ కౌమిదితో కళాశాల అభివృద్ధిపై చర్చించారు. కళాశాలకు వచ్చిన వడ్డేకు ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది,ఇతర సిబ్బంది గౌరవపూర్వకమైన స్వాగతం పలికారు.

డిపిఆర్ఓ కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర -భీమవరం: ఆధ్యాత్మికతతో పాటు మానవ సత్సంబంధాలు, పండుగల సాంప్రదాయాల్లో కలిసి ఉంటాయని అది సంక్రాంతి పండుగలో స్పష్టంగా కనిపిస్తుందని డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో సంక్రాంతి వేడుకలను సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య కేకును కట్ చేసి పరస్పరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వారికి సంక్రాంతి,తమిళులకు పొంగల్ పేరు ఏదైనా పండగ ఒకటే అన్నారు.సంక్రాంతి అంటే పుణ్యకాలం అని,మకర రాశిలో సూర్యుడు ప్రవేశించే కాలాన్ని ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణించడం జరుగుతుందన్నారు. పవిత్రమైన,శాస్త్రోక్త సత్కర్మలకు ఈ పుణ్యకాలం ప్రధానమైందిగా చెబుతారన్నారు. ఆచరించే పద్ధతులలో మాత్రం భిన్నత్వం కనిపిస్తుందన్నారు. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే కాలం కావడంతో భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజుగా ఉంటుందన్నారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటి ముందు భోగి మంటలలో పనికిరాని బట్టలు,వస్తువులను వేసి అరిష్టాలను,పీడలను తొలగించుకుంటా రన్నారు. వేడుకలలో విశ్రాంతి సమాచార ఇంజనీర్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కెటియంకె సత్యనారాయణ రాజు,పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాస నెహ్రూ,జూనియర్ అసిస్టెంట్ పులి రవితేజ,రికార్డు అసిస్టెంట్ దేవరకొండ సోమరాజు, ఫోటోగ్రాఫర్ పి.వై రత్నాకర్, టెక్నికల్ సబార్డినేట్ పి.వీరభద్రం, ఆఫీస్ సబార్డినేట్ జె.రాజేష్ పాల్గొన్నారు.

జూదాల జోలికి పోవద్దు... భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

ఎస్సై మహమ్మద్ నసీరుల్లా వెల్లడి

విశాలాంధ్ర-ఉండి : సంక్రాంతి నేపథ్యంలో గ్రామాలలో ప్రజలు, యువత జూదాల జోలికి పోవద్దు, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఉండి ఎస్సై మహమ్మద్ నసీరుల్లా వెల్లడిం చారు. మండల పరిధిలోని చిలు కూరు, చెరకువాడ, వెలివర్రు, గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామస్తులకు, యువతకు అవగాహన కార్యక్రమం ఆయా గ్రామాల సర్పంచులు సాంబశివరావు, శ్రీనివాసరాజు, సోమరాజు, అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీరుల్లా మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలను అందరూ పాటించాలన్నారు. గ్రామాల్లో జూద క్రీడలు నిర్వహించినా ప్రోత్సహించిన సహించేది లేదని హెచ్చరించారు. జూదాల వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల సూచనలు సలహాలను గమనంలో పెట్టుకొని జూద క్రీడల జోలికి పోవద్దని హితవు పలికారు. జూదాల వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భోగి మంటలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గత నాలుగు రోజులుగా జరుగుతున్నాయని గురువారం చివరి రోజు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సకల సౌభాగ్యాలను కలుగజేసే రైతన్నను మర్చిపోకూడ దన్నారు. రైతు కష్టాన్ని గుర్తు పెట్టుకొని వారిని అన్ని రకాలుగా ఆదరించాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్2 పిఓ భాస్కరరావు మాట్లాడుతూ భోగిమంట విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులు భోగి మంటను వేశారు. విద్యార్థినులు సాంప్ర దాయ వస్త్రధారణలో వచ్చి అందరినీ ఆకట్టు కున్నారు. తదనంతరం వివిధపోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతు లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ చైతన్య, డాక్టర్ టి.అక్కిరాజు, డాక్టర్ కె. స్వరూప రాణి ,కోఆర్డినేటర్ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, కె.వి గణేష్ కుమార్, ఎవిఎస్ బి. శ్రీనివాసరావు,డాక్టర్ జి వి శారదా దేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి. వెంకటరమణ, కె.. గిరిబాబు,షేక్ పర్వీన్,పి భాస్కర రావు, మోయిన్ అన్సారి, రాణి దుర్గ, వెంకన్న బాబు పివి రమేష్, పిడి స్వాతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సికె నాయుడు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - కడియం : కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నుండి జరగనున్న క్రికెట్ టోర్నమెంట్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పండగ సమయంలో యువకులు కోడిపందాలు, పేకాట వైపు వెళ్ళకుండా, క్రీడల వైపు మక్కువ చూపిస్తే ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఇండియన్ మొదటి టెస్ట్ క్రికెట్ కెప్టెన్ సి కె నాయుడు జ్ఞాపకార్థం రెండు దశాబ్దాలుగా టోర్నమెంట్లు నిర్వహిస్తున్న కడియం యువతను అభినందించారు. విజేత జట్టుకు 25000 నగదు మరియు జ్ఞాపిక, ద్వితీయ స్థానానికి 15000 నగదు మరియు జ్ఞాపిక, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ లకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేస్తామని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో పలువురు కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, పలు జట్ల క్రికెటర్లు, అధిక సంఖ్యలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి

విశాలాంధ్ర - కొవ్వూరు : రాష్ట్రంలోని మాదిగ యువతకు అదేవిధంగా లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు పేర్కొన్నారు. విజయవాడలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో డైరెక్టర్‌గా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం తాను పార్టీలో ఆవిర్భావం నుండి పాటుపడుతున్నాను అన్నారు. దీనికి ప్రతిఫలంగా పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తనకు ఈ పదవి ఇచ్చి గౌరవించారు కష్టపడే పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తన నియామకమే ఉదాహరణ అన్నారు ఈ సంవత్సరం మార్చి నుంచి యువతకు లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు రుణాలను మంజూరు చేస్తామన్నారు. ఈ రుణాలకు సబ్సిడీ ఉంటుందన్నారు. అందువల్ల అర్హులైన వారు కార్పొరేషన్కు తమ దరఖాస్తులు అందజేయాలని వెంకటరావు తెలిపారు.

వాడపల్లి రాంపుల కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - కొవ్వూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా ఇసుక రాంపులలో పనిచేస్తున్న కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని కారణం దాదాపు పది రోజులుగా కొవ్వూరు మండలం వాడపల్లి ఔరంగాబాద్ ర్యాంపులు మూసి వేయడమే కారణంగా తెలుస్తోంది. ఎంత జరుగుతున్న అధికార యంత్రాంగం మేలుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఇరిగేషన్ రెవెన్యూ మైనింగ్ అధికారులు స్పందించి రాంపులు తెరిచి తమకు ఉపాధి కల్పించాలని కార్మికులకు కోరుతున్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న మూడు ప్రోక్లయినరు సీజ్

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం బుర్రిలంక ఇసుక ర్యాంపులో అక్రమంగా మైనింగ్ చేస్తున్న మూడు ప్రోక్లయినర్లను సీజ్ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇసుక రవాణా నిమిత్తం అక్రమ మైనింగ్ చేస్తున్న నేపథ్యంలో రెవిన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రాత్రి సమయంలో నదీ గర్భంలో యంత్రాల సహాయంతో ఇసుకను తవ్వుతుండగా మూడు జెసిబిలను సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి మైనింగ్ చేస్తున్న వారు తమ తీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని గుత్తేదారులను ఆమె హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయానికి డ్రోన్ స్ప్రే

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో గల కాటవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గురువారం వరిలో తెగుళ్ల నివారణకు బలానికి డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ తాతరావు ఆధ్వర్యంలో 30 ఎకరాల వరి పొలానికి డ్రోన్ ద్వారా దశపని ద్రావణం ఇంగువ జీవామృతం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా తాతరావు మాట్లాడుతూ డ్రోన్ వాడకం వల్ల రైతులకు చాలా మేలు జరుగుతుందని అన్నారు. పిచికారీ చేసిన మందులు పొలానికి బాగా అందుతాయని అన్నారు. మిర్తిపాడు యూనిట్ ఇన్చార్జి శ్రీనివాస్‌రావు, ఐసిఆర్పిలు భవాని, సుబ్రహ్మణ్యం, నాగదేవి, రైతులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ కృషి

విశాలాంధ్ర - కొవ్వూరు : పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్య అనేది దూరం కాకుండా ఉండాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు విజయకేతనం అనే స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థి చదువుకోవాలనే సంకల్పంతో రానున్న పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు స్టడీ బుక్స్ ను పంపిణీ చేయడం కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని కోరారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు కంటమని రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని ఏడవక వార్డు కౌన్సిలర్ పాలూరి నీలిమ, ఎంఈఓ, ఉపాధ్యాయులు అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి జనసేన అండ

విశాలాంధ్ర - దేవరపల్లి : ఆపదలో ఉన్న వారిని జనసేన పార్టీ తక్షణం ఆదుకుంటుందని గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇం చార్జ్ సువర్ణ రాజు పేర్కొన్నారు దేవరపల్లి మండలం సుబ్బరాయపురంలో గురువారం ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాలను సువర్ణ రాజు జనసేన నాయకులు కలుసుకున్నారు చాపల చంద్రమ్మకు పదివేల రూపాయలు నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. మంద వెంకన్న మంద రామయ్య కుటుంబాలకు 2500 నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు ప్రభుత్వం ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి తమ వంతు సహకారం అందిస్తామని సువర్ణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కట్నం గణేష్ కృష్ణ పాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ జనసేన నేతలు పోసి వెంకటరత్నం చాపల నాగరాజు పసుపులేటి శివ నాగ ప్రసాద్ దాసరి శేషు రావు బల్ల రాము గంటా సురేష్ పల్లంట్ల పాండు అయినాల నరసింహామూర్తి ఆకుల నాని పల్లంట్ల సతీష్ నాని డేవిడ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - సీతానగరం: నేడు మండలంలో సీతానగరం గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన బడ్జెట్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భారతి మాట్లాడుతూ ఈ సర్వసభ్య సమావేశంలో మండలం అభివృద్ధి కొరకు బడ్జెట్ ప్రవేశపెట్టనున్నామని అన్నారు. కావున అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

శివాంజనేయ నర్సరీని సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ ఐజి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం కడియపులంకకు చెందిన శివాంజనేయ నర్సరీని దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ ఐజి అరోమా సింగ్ ఠాకూర్ (ఐ ఆర్ పి ఎఫ్ ఎస్) కుటుంబ సమేతంగా సందర్శించారు. వారికి సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు మొక్కను ఇచ్చి స్వాగతించారు. నర్సరీ సందర్శన అనంతరం ఠాగూర్ మాట్లాడుతూ దేశ విదేశాల మొక్కలు అన్ని కడియం నర్సరీలలోనే ఉన్నాయన్నారు. కొన్నిరకాల ఆయుర్వేద మొక్కలను గురించి అడిగి తెలుసుకున్నారు. బోన్సాయ్ మొక్కలు అబ్బురపరిచే విధంగా ఉన్నాయని, కడియం నర్సరీ సందర్శించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ తో పాటు వల్లీశ్వర్ బాబుజి ఐ ఆర్ పి ఎఫ్ ఎస్ సీనియర్ కమాండర్, బి సదయ్య, వారి సిబ్బంది పాల్గొన్నారు.

'భాష్యం'లో సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి భాష్యం స్కూల్లో గురువారం అంగరంగ వైభవంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలకు తాము ప్రాధాన్యత ఇస్తామని దీనిలో భాగంగా తమ పాఠశాల విద్యార్థులు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ముగ్గులు రంగవల్లులు వివిధ వేషధారణలో విద్యార్థులు అనేక సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాన్స్ ప్రిన్సిపాల్ శబన అధ్యాపకులు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

విశాలాంధ్ర - సీతానగరం: సంఘ విద్రోహ చర్యలకు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని ఎస్ ఐ రామ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ముగ్గుళ్ళ గ్రామానికి చెందిన ఇందుగు మిల్లి సిద్దు తండ్రి పేరు రాజు పై ఐ పి సి సెక్షన్లు 307,354,324,143,144 మొదలగు వాటిని నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించడం జరిగింది అని అన్నారు. ముద్దాయి అరెస్టులో భాగంగా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది అని అన్నారు. అలాగే సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున యువత ఎటువంటి గొడవలు పడకుండా చట్ట పరిధిలో వ్యవహరిస్తూ పోలీసు వారికి సహకరించవలసిందిగా యువతను కోరుతున్నామని అన్నారు.

జీ తెలుగులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా జీ వినియోగదారులకు సరికొత్త కార్యక్రమాలను సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 6 గంటలకు విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం సినిమాను, 12వ తేదీ సాయంత్రం 5. 30 గంటలకు పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను, 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమాలను ప్రసారం చేయనున్నామన్నారు. కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు ' విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని జీ తెలుగు అందిస్తోందన్నారు. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు వాచ్ అండ్ విన్ కాంటెస్ట్ను నిర్వహిస్తోందన్నారు. జీ తెలుగు. మీరు చేయాల్సిందల్లా కల్కి సినిమా చూస్తూ టీవీ స్క్రీన్పై వచ్చే క్యూఆర్ కోడ్ని స్కాన్ చేయడం లేదా www.kalkionzeetelugu.zee5.comలో లాగిన్ అయి కల్కి గేమ్ ఆడి అదిరిపోయే బహుమతులు గెలవచ్చన్నారు. సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమం లో యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్లు పేరున రెండు టీమ్లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారన్నారు. సాగిన ఈ కార్యక్రమాలను జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూడాలన్నారు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు మండలం కాపవరం సమీపంలోని గోవర్ధనగిరి మెట్ట వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వాహనం మోటార్ బైక్ ను ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. హైవే పోలీసులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు గోపాలపురానికి చెందిన కే వెంకటేశ్వరరావుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ సిబ్బంది తెలిపారు.

తిరుమల ఘటనపై బీజేపీ సంతాపం

విశాలాంధ్ర - అమలాపురం : తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం జరిగిన తోపులాటలో పలువురు భక్తులు మరణించడం పట్ల బిజెపి జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు దొరబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయాలపాలై హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్నవారు త్వరగా కోలుకోవాలని యాళ్ల దొరబాబు ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ సెలవుల్లో దేవాలయాలకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చే పరిస్థితుల నేపథ్యంలో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్‌లను ఆదేశించారు.

సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్సై

విశాలాంధ్ర - గండేపల్లి : రాబోవు సంక్రాంతి పండుగను ప్రజలు సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, గ్రామాల్లోని ఎవరూ కూడా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, కోడిపందాలు, పేకాట, గుండాట వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని గండేపల్లి ఎస్సై శివ నాగబాబు అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లేవారు ఎవరైనా విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచకూడదని, తమ మెడలో ధరించాలని లేదా బ్యాంకు లాకర్లో భద్రపరుచుకోవాలని సూచించారు. మండల ప్రజలకు గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

పల్లంకుర్రులో సీసీ కెమెరాల ఏర్పాటు

విశాలాంధ్ర - కాట్రేనికోన : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పల్లంకుర్రు మెయిన్ గ్రామంలో సీసీ కెమెరాలు వెలిసాయి. స్థానిక వర్తక వ్యాపార సంఘం, గ్రామ పెద్దలు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలను, నేరాలను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు కాట్రేనికోన ఎస్సై అవినాష్, మంతెన బాబు, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, మంతెన సూరిబాబు, స్థానిక వ్యాపారులు, పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు నరసింహ కాశ్యప్ ఎంపిక

విశాలాంధ్ర - ఆల మూరు : ఇటీవల మంగళగిరి లో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరే షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలలో ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన కెప్టెన్ పెద్దింటి నరసింహ కాశ్యప్ జట్టు తృతీయ స్థానంలో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయారు. 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనగా తూర్పుగోదావరి జిల్లా జట్టు సత్తాచాటింది. ఈ జట్టు కోచ్‌గా తోట రవి ఉండగా కెప్టెన్‌గా నరసింహ కాశ్యప్ వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తాచాటి జాతి స్థాయి పోటీలకు ఎంపికైన నరసింహ కాశ్యప్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

రాఘవమ్మ సేవలు చిరస్మరణీయం

జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి సిపిఎంలో జిల్లా కమిటీ సభ్యురాలిగా కుడుపూడి రాఘవమ్మ చేసిన సేవలు చిరస్మరణీయం అని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు కొనియాడారు. గురువారం ఉదయం కాకినాడ సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కుడుపూడి రాఘవమ్మ సంతాపసభ నిర్వహించారు. సిపిఎం జిల్లా సీనియర్ నేత దువ్వ శేషబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుకు కరణం ప్రసాదరావు, జి బేబిరాణిలు రాఘవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ మహిళా సంఘం మరియు వ్యవసాయ కార్మిక సంఘాల కార్యాచరణలో రాఘవమ్మ సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు బేబిరాణి మాట్లాడుతూ రాఘవమ్మ ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామంలో తన భర్త యుటిఎఫ్ నేత అయిన కుడుపూడి నర్సింహమూర్తి ప్రోత్సాహంతో ప్రజా ఉద్యమాలలో అడుగుపెట్టారని తెలిపారు. దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలుగా, సిపిఎం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ సభ్యురాలుగా రాఘవమ్మ సుదీర్ఘ కాలం ప్రజాసేవలో ఉన్నారని వారి స్ఫూర్తితో నేటితరం ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెవస్ శ్రీనివాస్‌తో పాటు కోనేటి రాజు, వల్లు రాజు బాబు, కుంచే మణి తదితరులు మాట్లాడుతూ రాఘవమ్మతో వారి అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజ్ కుమార్, నగర కన్వీనర్ పలివెల వీరబాబుతో పాటు నగర కమిటీ సభ్యులు కె సత్తిరాజు, మలక వెంకట రమణ, రూరల్ కమిటీ సభ్యులు సిహెచ్ అజయ్ కుమార్, టి రాజా, పి రామకృష్ణ మరియు చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, ఎం హరనాధ్, కె వీరబాబు, కె సింహాచలం, జి భూలక్ష్మి, సంజయ్, విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా "వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా" రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తోందని, పేదలకు అందుబాటులో ఉండే వైద్యాన్ని గత ప్రభుత్వంలో సక్రమంగా పనిచేసిందని, నేడు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ తూట్లు పొడుస్తోందని, గత ప్రభుత్వం 25 లక్షలు ఉండే ఆరోగ్యశ్రీని నేడు కుదించడం జరిగిందని, ఆరోగ్యశ్రీ పై నమ్మకం ఉండేదని, నేడు పేద ప్రజలకు అందని ద్రాక్షలా ఉందని, కార్పొరేట్ సంస్థల్లో ఆరోగ్యశ్రీ చెల్లింపులు లేక రాష్ట్ర ప్రభుత్వం సతమవుతున్నదని, రాష్ట్రంలో గవర్నమెంట్ హాస్పిటల్‌లో సరైన వైద్య సదుపాయంలేవని డాక్టర్స్ రిక్రూట్మెంట్స్ లేవని, ప్రమాద వ్యాధులకు కార్పొరేట్ హాస్పిటల్స్ సంస్థలను ఆశ్రయించవలసి వస్తోందని, అక్కడ వేసే ఫీజులకు వైద్యం చేయించుకోలేకపోతున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికి నెరవేర్చలేకపోతుందని, పేద ప్రజలకు అందే వైద్యం సక్రమంగా జరిగే చూడాలని ప్రభుత్వాన్ని దేవాదుల డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

సీఐ నరేష్ కుమార్

విశాలాంధ్ర - రాజోలు : రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అని రాజోలు సిఐ నరేష్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం రాజోలులో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహ నాలు నడిపి నిండు జీవితాన్ని బలి చేసుకోకండి, మీ మీద ఆధారపడ్డ కుటుంబానికి ఆధారం లేకుండా చేయకండి అని అన్నారు. అలాగే వాహనదారులు, ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు సక్రమంగా పాటించాలని కోరారు.

వైభవంగా ఆదిత్య కలర్స్ యూత్ ఫెస్ట్ ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్ 2025 యువజనోత్సవాలు ఎంతో ఉత్సాహంగా ప్రారంభ మైనాయి. మొదటి రోజు ఉదయం 9-30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జెఎన్‌టియుకె రెక్టార్ డా కెవి రమణారావు, గౌరవ అతిథిగా ఐక్యద్రా ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఎల్ఎల్‌సి ఫౌండర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు, పాల్గొనగా యూనివర్సిటీ ఉపకులపతి డా ఎంబి శ్రీనివాస్, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఎంతో అలరించాయి. బెలూన్‌లను ఎగరవేసి యువజన ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా సతీష్ రెడ్డి స్థానిక పత్రికా విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల విరామం తర్వాత ఆదిత్య కలర్స్ ఏర్పాటు చేశామని, విద్యారుల ఉత్సాహం వారి కోరిక ప్రకారం ఇది ఏర్పాటు చేయక తప్పలేదు అని విద్యార్థుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని, సినీ ప్రముఖుల సందడి, ఆహ్లాదపరిచే లేజర్ షో, విద్యారుల ఆటపాటలు ఈ కలర్స్‌లో చోటు చేసుకున్నాయని, సుమారు 50000 మందికి తగ్గకుండా పాల్గొంటారు అనే అంచనాలతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాట్లు, సిసి కెమెరాలతో పర్యవేక్షణ, రవాణా సౌకర్యాలు, భోజనం వసతులు అన్ని సమకూర్చడం జరిగింది అని ప్రతి విభాగానికి టీమ్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. స్పోర్ట్స్, గేమ్స్ సాంస్కృతిక విభాగాలలో పాల్గొనడానికి వివిధ కళాశాలల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు రిజిస్టర్ జరిగిందని, 67 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొనడం జరిగింది అని సతీష్ రెడ్డి తెలిపారు.

నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలి

సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేస్ - 1 ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : సేవారంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకుని ఉపాధి అవకాశాలను పెంచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి ప్రియంవద ఔత్సాహిక వృత్తిదారులకు సూచించారు. కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా "సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేస్-1"ను గురువారం భానుగుడి పాత మీ సేవ సెంటర్లో నిర్వహించారు. వృత్తిదారుల రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ బి ప్రియంవద, టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె శైలజ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి ప్రియంవద మాట్లాడుతూ వడ్రంగి సేవలు, ప్లంబింగ్ సేవలు, కార్పెంటర్ సేవలు, గృహోపకరణాల రిపేరింగ్ సేవలు, బ్యూటిషియన్ సేవలు తదితర వృత్తులలో ఉన్నవారికి ప్రత్యేకంగా రూపొందించిన హోమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా సేవలను అందించనున్నామని తెలిపారు. ఔత్సాహిక వృత్తిదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మెప్మా ద్వారా వృత్తిదారుల జీవన ఉపాధిని మెరుగుపరచి వారి ఆర్థిక స్థితిని మార్చడమే ధ్యేయంగా అర్జీలు పనిచేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ డి వెంకట్రాజు, సిఒలు, ఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని తూర్పు లక్ష్మీపురం గ్రామంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక తయారీలో భాగంగా బాలల సభను గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి సత్య రాణి నాగ భార్గవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భార్గవి మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన అవసరాలను తెలుసుకోవడం, కిశోర వికాసం, బాలల హక్కులు, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఫోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ బాలల సభ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇజ్జనగిరి శివప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్, స్కూల్ చైర్మన్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి కోనసీమ క్రీడోత్సవాలు

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు మండల పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 7,8 , 9వ తేదీలలో రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కోనసీమ క్రీడత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి డిఎల్పిఓ బొజ్జిరాజు మాట్లాడుతూ వివిధ అంశాలలో ఈ మూడు రోజులలో నిర్వహించిన క్రీడోత్సవాలలో వివిధ జట్లు విజేతలుగా నిలిచాయని విజయం సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపి మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశామని తెలిపారు. క్రికెట్ పోటీలలో తాటిపాక జట్టు విన్నర్, రాజోలు జట్టు రన్నర్‌గా నిలిచాయని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ఏఓ మామిడిశెట్టి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ క్రీడోత్సవాలు ఇంత ఘనంగా ముగియడంలో సహకరించిన ఎంపిపి కేతా శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి ఇంటిపల్లి ఆనందరాజు, పొలామూరి శ్యాంబాబు, గ్రామ సర్పంచ్ రేవు జ్యోతి, వైస్ సర్పంచ్ పామర్తి రమణ, ఫిజికల్ డైరెక్టర్స్, ప్రధానోపాధ్యాయిని కె సరస్వతి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్, హెల్త్ సిబ్బందికి ధన్యవాదములు తెలియజేసారు.

'సిద్ధార్థ'లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు పాఠశాల డైరెక్టర్ కె ముల్లారావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. విద్యార్థులందరూ ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, కోడి పందాలు, గాలిపటాల ప్రదర్శన, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - ఆలమూరు : రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసి సక్రమంగా సాగు జరిగే విధంగా చేయడమే లక్ష్యంగా పనిచేసు ్తన్నట్లు ఆలమూరు మండలం చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. జొన్నాడ మెయిన్ కాలనీ నుంచి వచ్చే పంట కాలువ ఇటీవల కాలంలో మూసుకుపోవడంతో ఆలమూరులోని ఆయకట్టుకు సాగునీరు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాగునీటి ఇబ్బందులను రైతులు చింత ూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి దృష్టికి తీసుకురా వడంతో అయినా స్పందించి మూసుకుపోయిన కాలువను వెంటనే తవ్వకాలు చేసే కార్యక్రమం ప్రారంభించారు. సాగునీటి సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తక్షణం స్పందించి పంటలకు సాగునీరు సక్రమంగా చేరే విధంగా చర్యలు తీసుకుంటానని శ్రీనివాస్ చౌదరి హామీ ఇచ్చారు.

జగ్గంపేటలో ఐసీడీఎస్ సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : ఐసిడిఎస్ స్థానిక ప్రాజెక్ట్ అధికారిణి ఎమ్ పూర్ణిమ అధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పట్టణం మంచి నీటి చెరువు గట్టు అంగన్వాడీ సెంటర్ వద్ద చిన్నా రులచే వివిధరకాల వేషధా రణలు వేయించారు. బొమ్మల కొలువు అందరినీ ఆకర్షించింది. ముగ్గుల పోటీలు నిర్వహించి తహసీల్దార్ జెవిఆర్ రమేష్, ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్ తిలకించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బి ప్రశాంతి, అంగన్వాడీ సూపర్ వైజర్లు అమ్మాజీ, యువజన సంఘం అధ్యక్షురాలు అనూష, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాతృ భాషను కాపాడుకోవాలి

- జిజియులో ఘనంగా ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు

విశాలాంధ్ర - రాజానగరం : మాతృ భాష,అమ్మ భాషైన తెలుగు భాష మూలలను పిల్లలకు వివరిస్తూ మాతృ భాషను ప్రతిఒక్కరు కలిసి కాపాడుకుందామని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గోదావరి గ్లోబల్ వర్సిటీ (జిజియు) ఆధ్వర్యంలో చైతన్య విద్యాసంస్థల అధినేత, జిజియు వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ కలిదిండి వివి సత్యనారాయణ రాజు(చైతన్య రాజు)అధ్యక్షతన గత రెండు రోజులుగా వైభవంగా జరిగిన 2వ ప్రపంచ తెలుగు మహాసభలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భాష వలన జాతి పుడుతుందని, జాతిని అభివృద్ధి చేసుకోవాలంటే అందరూ కృషి చేయాలనీ కోరారు. పిల్లలకు భాష పట్ల మక్కువ కల్పించాలన్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల్లో,ప్రభుత్వాల్లో విధానాలు మారాలన్నారు.దురదృష్టవశాత్తూ మాతృ భాషను నిర్లక్ష్యం చేస్తూ వచ్చారన్నారు. మాతృభాషపై పట్టు వస్తేనే మిగిలిన భాషలు వస్తాయన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు.మమ్మీ డాడీ సంస్కృతి నుంచి అమ్మా నాన్నా అని పిలుచుకునే విధానంలోకి మారాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లా డుతూ తెలుగు భాష పరిరక్షణకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూ పద్య నాటకాలను, సాంఘిక నాటకాలను ప్రోత్సహిస్తూ నంది నాటకోత్సవాలు కూడా పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో అద్భుత భాషగా కీర్తిపొందిన తెలుగు భాషను సమిష్టిగా కాపాడుకుందామనీ సూచించారు. మరో అతిథిగా పాల్గొన్న రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ మధురమైన అద్భుత భాష, విశిష్ట సంస్కృతి, ఘనచరిత్ర మనదన్నారు. భాష, సంస్కృతి, చరిత్ర మనం అవగాహన చేసుకోవడంతో పాటు భావి తరాలకు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో మాతృ భాషకు ప్రాధాన్యత ఇచ్చిందని ఆమె గుర్తుచేశారు. ఐతరేయ బ్రాహ్మణంలో, మహాభారతంలో కూడా ఆంధ్రుల గురించి ఉందని పెద్దలు చెబుతారన్నారు. సంస్కృతి అంటే జీవన విధానమని,రాబోయే సంక్రాంతి పండుగ వంటివి మన సంస్కృతిలో భాగమని ఆమె పేర్కొన్నారు. మరో అతిథిగా విచ్చేసిన ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ మాట్లాడుతూ దేశంలోని ఇతర ప్రాంతాలవాళ్ళు, విదేశీయులు కూడా తెలుగు భాష గొప్పతనాన్ని గుర్తించి కొనియాడుతుంటే, మనం ఇంకా గుర్తించలేక పోతున్నామన్నారు.ఆంగ్ల భాషపై వ్యామోహంతో తెలుగును నిర్లక్ష్యం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రాథమిక విద్యాభ్యాసానికి సంబంధించి జాతీయ విద్యా విధానంలో మాతృ భాషలకు ప్రాధాన్యత ఇవ్వడం,రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉండడం, పట్టువీడని వ్యక్తిత్వం కలగలసిన ఈ సుదర్శన కాలంలో తెలుగు భాషకు మంచి రోజులు వస్తాయనీ ఆశాభావం వ్యక్తంచేశారు. భాగంగా సభకు విచ్చేసిన అతిథులను జిజియు ఛాన్సలర్ సత్యనారాయణ రాజు, ప్రో ఛాన్సలర్ కె.శశి కిరణ్ వర్మ, కిమ్స్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవి కిరణ్ వర్మలు సత్కరించి, జ్ఞాపికలు అందజేసార.ఈ కార్యక్రమంలో జిజియు ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, ఎమ్మెల్యే లు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ,బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు, టీచర్స్ ఎమ్మెల్సీ గోపి మూర్తి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ మంత్రి పివి రాఘవులు, మాజీ ఎమ్మెల్యే వివేకానంద, సినీనటి హేమ, కె టి రామ రాజు, మాజీ ఎమ్మెల్సీ గొనె ప్రకాశరావు, కన్నయ్య కదంజి, సాహితీవేత్త ఎర్రాప్రగడ రామ కృష్ణ, డా వేదుల శిరీష, నీరుకొండ వీరన్న చౌదరి, మంతెన కేశవరాజు, వసుధ ఫౌండేషన్ రాజు,పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర రావు, కవులు, సాహితీ వేత్తలు, జిజియు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - గోపాలపురం : పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవమానపరిచిన అమిత్‌షా వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి టి కె విశ్వేశ్వర రెడ్డి దుయ్యబట్టారు. గురువారం స్థానిక చెక్పోస్ట్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టపర్తి రామ్మోహన్‌రావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాతను బీజేపీ ప్రతిసారి హేళన చేస్తోందని అమిత్‌షా పై చర్యలు తీసుకునేంత వరకు కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై రాష్ట్రంలోని పార్టీలు టిడిపి, జనసేన, వైకాపా స్పందిం చకపోవడం వారి ద్వంద వైఖరికి నిదర్శనం, ఈ పార్టీలకు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అంబెద్కర్ గుర్తొస్తాడు ఆయన పేరుని వాడుకుంటారని విమర్శించారు. అంబేద్కర్‌ను హేళన చేస్తే ఊరుకోబోమని ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చ రించారు. దేశంలో స్వాతంత్ర్య స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న ప్రతి భారతీయుడు ఆరాధించే వ్యక్తి బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ అని ఆయన పేరు పలకడానికి గుండె, పెదాలూ ఉవ్విళ్ళూరు తుంటాయని అలాంటి అంబేద్కర్‌ను అగౌరవ పరచ డాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని . అమితాషాకు, ఆయన పార్టీ వారికీ ఇష్టం ఉన్నా లేకున్నా ఈ దేశ ప్రజల్లో అత్యధి,కులు అంబేద్కర్ పేరును స్మరిస్తూనే ఉంటారు అని అంబేద్కర్‌ను కాంగ్రెస్ వారే గౌరవించలేదని అమిత్ షా అండ్ బిజెపి పార్టీ ఎంత గొంతు చించుకున్నా అదంతా వృధా అని విశ్వేశ్వరరెడ్డి అన్నారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మార్టిన్ లుతార్,పీసీసీ సభ్యులు జ్యేష్ఠ సతీష్ బాబు, రామారాయుడు, విల్లూరి రమేష్, కౌలురి రతన్ రాజు,కౌలురి బాబాజీరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చింతలపూడి సునీల్, ఫ్రాన్సిస్, గుల్ల ఏడుకొండలు,చిన్నం మురళీ కృష్ణ, మేడ వరపు భద్రరావు,కాకర్ల హరిబాబు,వెలగ రామ కృష్ణ,ఆలపాటి రామ్మోహనరావు,డాక్టర్ వాడ యర్, మొత్తా శారదా,బోనిగే రాంబాబు, పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, గుత్తికొండ సూరిబాబు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి : సీఐ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో యువత ముందుకు రావాలని, క్రీడల్లో క్రీడాకారులుగా విజ యం సాధిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బిఎస్ అప్పారావు అన్నారు. ప్రత్తి పాడు హైస్కూ ల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ సం క్రాంతి సంప్రదాయ క్రీడలు రెండో రోజుతో ముగిసాయి. బుధవారం గురువారం నిర్వ హించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ విజేతగా ప్రత్తిపాడు, ద్వితీ బహుమతిగా గజ్జనపూడి, తృతీయ బహుమతిగా రాచపల్లి జట్టు విజయం సాధించారు. సిఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం ప్రథమ విజేతకు రూ.10,000, వేలు ద్వితీయ బహుమతిగా రూ.7000 వేలు, తృతీయ బహుమతికి రూ.5000 వేలు మెమొంటోలు అందజేశారు. సిఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ప్రజలందరూ సుఖసంతో షాలతో పండగను జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి వివాదాలు లేకుండా ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా పోలీసు శాఖ నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలుగా సాధించిన అందరికీ పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి : మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర - కడియం : ఆరోగ్యకరమైన ఆహారం కొరకు ప్రకృతి వ్యవసాయం అవసరమని, రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సాధించాలని రాష్ట్రప్రభుత్వం పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందులు దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం కడియం మండలం మధవరాయుడుపాలెం గ్రామంలో సర్పంచ్ అన్నందేవుల చంటి ప్రకృతి వ్యవసాయ విధానాలలో పండిస్తున్న మినుము, పెసర పొలంను మంత్రి సందర్శించారు. మంత్రి దుర్గేష్ కు సర్పంచ్ చంటి వరి కంకు, నాగలి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని అత్యంత కీలకమైన అంశముగా ప్రోత్సహిస్తుందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి సారిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మహబూబ్ వలి, ఎన్ ఫ్ ఏ గౌతమ్, ఫార్మర్ సైంటిస్ట్ రాము, ఇతర ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామంలోని రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాఘవమ్మ మృతికి సీపీఐ నేత సత్తిబాబు సంతాపం

విశాలాంధ్ర - అమలాపురం : సీపీఎం సీనియర్ నాయకురాలు కుడుపూడి రాఘవమ్మ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి మహిళా చైతన్యానికి తీరని లోటని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి సత్తిబాబు పేర్కొన్నారు. రాఘవమ్మ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమెకు ఘననివాళి అని అన్నారు. రాఘవమ్మకు జోహార్లు అర్పించారు.

గౌరీనాయుడుకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభినందన

విశాలాంధ్ర - పిఠాపురం : కాకినాడ పట్టణంలో పిఠాపురం మహారాజా కళాశాలలో జనవరి 5 నుండి 8 వరకు నిర్వహించిన 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలలో యువ సాహితీవేత్త, రచయిత, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ కిలారి గౌరీ నాయుడు ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. యుటిఎఫ్ 50వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా ఎమ్మెల్సీ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు, విద్యావేత్త కె లక్ష్మణరావు ముగింపు సభలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు భారత రాజ్యాంగంపై రచించిన విశ్లేషణాత్మక గ్రంథాన్ని గౌరీ నాయుడుకి ప్రత్యేకంగా బహుకరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదిహేను ఏళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై లక్ష్మణరావుతో చర్చించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తానని లక్ష్మణరావు తెలిపారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళా రంగాలలో కృషి చేస్తూ ఎంతోమంది యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్న గౌరీ నాయుడుని అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న లక్ష్మణరావు సేవలను కొనియాడారు. గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన గోపిమూర్తిని ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, ఉపాధ్యా యులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొంకాపల్లి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - అమలాపురం : కొంకాపల్లి జెవెన్ మున్సిపల్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలు చేశారు. సంక్రాంతి గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు పీవీ ఎల్ఎన్ శ్రీరామ్ సందర్భాను చితంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె ఘన సత్య నారాయణ, ఎస్ఎంసి చైర్మన్ ముక్కోటి రాంబాబు, మంచిగంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యా యులు వెంకటేశ్వరరావు, పద్మావతి, సుబ్రహ్మణ్యేశ్వర రావు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉండండి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : మీ సమయాన్ని ఆరోగ్యానికి సరిపోయేలా చేసుకొనే అవకాశం మీ చేతుల్లో ఉందని .. అది మిమ్మల్ని ఆరోగ్యవంతంగా చేస్తుందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం స్థానిక పోస్టు మెట్రిక్ బాలికల వసతి గృహంలో జిల్లా యంత్రాంగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇతర సమన్వయ శాఖల ఆధ్వర్యంలో పోషన్ ప్లస్ కార్యక్రమాన్ని కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, కౌమార దశ లోని ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించే క్రమంలో కార్యకలాపాల్లో భాగస్వామ్యం పోషన్ ప్లస్ కింద ఐరన్ మాత్రలు తో పాటుగా మునగాకు పొడి వసతి గృహాలలో ఉన్న బాలికలకు అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. మనం తీసుకునే ఆహారంలో తప్పకుండా ఐరన్ పోషకాలు అందు తున్నయో లేదో నిర్ధారణ చేసుకోవడం ముఖ్యం అన్నారు. నేడు ఫాస్ట్ ఫుడ్, పోషక విలువలు లేని ఆహారం తీసు కోవడం వల్ల రక్త హీనతకు గురి అవ్వడం చూస్తున్నామని తెలిపారు. కౌమార దశలో ఉన్న బాలికలకు మునగాకు పౌడర్ ఇవ్వటం జరుగుతోందనీ, ముఖ్యంగా సంక్షేమ వసతి గృహాలలో ఉన్న బాలిక లకు ప్రభుత్వం అందచేస్తున్న వాటికి అదనంగా "ప్రాజెక్ట్ ఐరన్ ప్లస్ " కార్యక్రమం ద్వారా మున గాకు పొడి అంద జేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణపై, మంచి పోషక విలువలు కలిగిన ఆహారంలో తప్పకుండా తీసు కుని రావడం పై జిల్లా వ్యాప్తంగా యుక్త వయసులో వున్న బాలికలు భవిష్యత్తులో కూడా కొనసాగించేలా ముందుకు రావాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు. జిల్లాలో ఎస్సి ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాలలో సుమారు కౌమర దశలో ఉన్న బాలికలు 2793 మందికి మురింగా (మునగాకు) పొడి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థులకి స్వయంగా ఆహారాన్ని వడ్డించిన కలెక్టరు ప్రశాంతి. ఈ కార్యక్రమములో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. వెంకటేశ్వర రావు, అధ్యక్షతన జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ ఎన్. వసుంధర , ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే ఎన్ జ్యోతి, సోషల్ వెల్ఫేర్ ఆఫసర్, ఎం. శోభా రాణి , జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ బి . శశాంక, డి ఆర్ డి ఎ పిడి ఎన్ వి వి ఎస్ మూర్తి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎస్. ఎస్. లక్ష్మి కాంతి, డాక్టర్ ఏ. వి. కె. చైతన్య, డాక్టర్ ఏ. భావని, విద్యార్థినీ లు పాల్గొన్నారు.

పేదలకు జీవనోపాధి కల్పనకు ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ. 300లతో ఏలూరు జిల్లాలో పనులు చేపట్టే విధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. గురువారం స్థానిక క్రాంతి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పథకం నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్.కె. వె ట్రి సెల్వి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులు కోరిన వారందరికీ పని కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి రోజువారి వేతనం రూ. 300 పొందే విధంగా ప్రణాళిక ప్రకారం పనులు కేటాయించుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించిన సమాచారానికి పూర్తిస్థాయిలో అందించడానికి రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన ప్రముఖులు ఉపాధి హామీ పథకం పై స్పష్టమైన అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ శిక్షణ ద్వారా మీకున్న సమస్యలు, సందేహాలను, నివారించుకుని విధుల నిర్వహణలో పొరపాటు లేకుండా నాణ్యతతో కూడిన పనులు చేపట్టి గ్రామాల్లో ఉన్న పేద ప్రజలకు, రైతులకు మీ ద్వారా మంచి జరిగేలాగా కృషి చేయాలని అన్నారు. మన జిల్లా ఉపాధి హామీ పథకం వేతనాల చెల్లింపులో తక్కువ సొమ్ము పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున పథకం ముఖ్యమైన మార్గదర్శకాలను పనులు చేపట్టే విధానాలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ లకు సూచించారు. శిక్షణా కార్యక్రమంలో ఈజీఎస్ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి డైరెక్టర్ వైవి షణ్ముఖ కుమార్, ఎడిషనల్ కమిషనర్ పంచాయతీరాజ్ మల్లెల శివప్రసాద్, ఏలూరు ప్రాజెక్టుఎం డైరెక్టర్ డ్వామా కె.వెం కట సుబ్బారావు, జడ్పీ సీఈవో సుబ్బారావు, డిఆర్డిఎ పిడి డాక్టర్ విజయ రాజు, డిపిఓ కె . అనురాధ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు ఏ పురుషోత్త మరావు డి దామోదర్ రావు పి శ్రీదేవి, జిల్లాలోని ఎం జి ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభయ రక్షక దళంతో సత్ఫలితాలు

ఏలూరులో దృశ్య రూప ప్రచార వాహనం ప్రారంభించిన ఎస్పీ, జేసీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాలో మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన అభయ రక్షక దళం సత్ఫలితాలను ఇస్తుందని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. ప్రతినిత్యం ఆకతాయిలా ఆగడాలకు కళ్లెం వేయడంతో పాటు విద్యార్థులను వేధింపులకు గురి చేసే ఈవ్ టీజర్ల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో అభయ రక్షక దళానికి ప్రత్యేక గుర్తింపు లభించింది అన్నారు. ఈ మేరకు అభయ రక్షక దళం గురించి ప్రజలకు మరింతగా ప్రచారం చేసేందుకు సిద్ధం చేసిన దృశ్యరూప ప్రచార వాహనాన్ని గురువారం ఏలూరులోని అమీనా పేటలో ఉన్న శ్రీ సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎస్పీ శివ కిషోర్, జెసి ధాత్రి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు, మహిళలు, వృద్ధులకు రక్షణ కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. మహిళ రక్షణ కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ లు 112, 1098, మరియు 1930 లకు ఫోన్ చేసిన వెంటనే పది నిమిషాల్లోపు పోలీసులు రక్షణ కల్పిస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పి ఎన్. సూర్యచంద్రరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా పోలీస్ స్టేషన్ మహిళా ఎస్సై కాంతి ప్రియ, శ్రీ సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీష్ పోలీస్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆర్ఎస్ఐ నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల నివాసాలు తొలగించొద్దు

విశాలాంధ్ర - కాకినాడ : అభివృద్ధి పేరుతో పేదల నివాస గృహాలను తొలగించవద్దు డాక్టర్ బి అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి రాము, కొండే రామకృష్ణ, బందారు సావిత్రి డిమాండ్. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏడిద గ్రామంలో చెరువు అభివృద్ధి పేరుతో ఆ చెరువు గట్టునే సుమారు 60 సంవత్సరాల క్రితం నుండి నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదల ఇల్లు తొలగించ వద్దంటూ గురువారం అనగా 9 జనవరి 2025 ఏడిద గ్రామ సచివాలయం వద్ద గృహవాసులందరూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి గ్రామ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సభ్యులురాము, కె రామకృష్ణ, బందారు సావిత్రి, సత్తిబాబు, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - కాకినాడ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గం ఏడిద గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అలాగే గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వ్యక్తిగత దరఖాస్తులను ఆ గ్రామ సర్పంచ్ మరియు గ్రామ కార్యదర్శులకు వ్యక్తిగత దరఖాస్తులను అందిస్తున్న లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి రాము, మరో కార్యవర్గ సభ్యులు కొండే రామకృష్ణ, ఏడిద గ్రామ సిపిఐ నాయకులు బందారు సావిత్రి రాజు, అప్పారావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం మేకలదిబ్బ సెంటర్ వద్ద గల ఎంపీపీ పాఠశాల నెం.4లో సంక్రాంతి సంబరాలు పి రమా నాగేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగు రంగుల రంగ వల్లులతో, గొబ్బెమ్మలతో, బొమ్మల కొలువు, పొంగలి, హరిదాసు, గాలిపాటలు, భోగి మంటలు, చిన్నారుల ఆటపాటలతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివేకానందలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

రాజోలు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేపటి నుండి పాఠశాల విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో మలికిపురం మండలం విశ్వేశ్వరాయ పురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల, పిండి వంటల పోటీలలో 6వ తరగతి విద్యార్థిని సిహెచ్ వన్మయి ప్రథమ స్థానంలో నిలువగా జె సంగమిత్ర ద్వితీయ స్థాయిలో నిలిచింది. యం కుషల్ శంకర్ హరిదాస్ వేషధారణలో సందడి చేసి అందరిని ఆకట్టుకున్నాడు. అలాగే విద్యార్థుల నృత్య ప్రదర్శన, బొమ్మల కొలువు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గోపాలపురం : సంక్రాంతి సంబరాలను స్థానిక బాపూజీ ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్, మరియు శార్వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యాజమాన్యాలు తమ ఉపాధ్యాయులు విద్యార్థులచే ఘనంగా నిర్వహించాయి. గురువారం విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా పండుగ వాతావరణం నెలకొల్పి అందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులచే హరిదాసు వేషధారణ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులచే రంగవల్లులు ఏర్పాటు, భోగి మంటలు గొబ్బెమ్మలు తెలుగు సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినీ విద్యార్థులను ఏర్పాటు చేసి సంబరాలు చేసుకున్నారు. బాబూజీ ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ కరస్పాండెంట్ గూడూరు వెంకటేశ్వర్రావు, శార్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రాపాక పని కిషోర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు : ఎ బి ఎన్ & పి ఆర్ ఆర్ కళాశాలలో సంక్రాంతి వేడుకలను కళాశాల మేనేజ్మెంట్ తరుపున శ్రీమతి తులసి నిఖిలేష్, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు. అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారన్నారు. కళాశాలలో ముందుగానే సంక్రాంతి వేడుకలు జరగటం, విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను ఏర్పాటు చేయుట జరిగిందని అని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రామ్మోహన్ తెలిపారు. కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ శ్రీమతి ఎ. రాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రమేష్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారలో పాల్గొన్నారు.

కొవ్వూరు : సిరులు కురిపించే సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని సుఖ సంతోషాలతో శిరులు సంపదలతో తుల తూగాలని కొవ్వూరు హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ నెల్సన్ ఆంటోనీ అన్నారు గురువారం కొవ్వూరు పట్టణంలోని హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు పండగ విశిష్టతను తెలిపే విధంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. నెల్సన్ ఆంటోనీ మాట్లాడుతూ సంక్రాంతి అంటే ప్రతి కుటుంబంలో కాంతులు విరజిల్లే పండుగ అని ప్రతి కుటుంబం ఆర్థిక వృద్ధిని కలిగి అందరూ సంతోషంగా జరుపుకునే పండుగ అన్నారు. కార్యక్రమంలో హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

రాజానగరం : మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నిలువెత్తు రూపం రంగు వల్లులనీ వినయ్ విద్య విహార్ స్కూల్ చైర్మన్ డాక్టర్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని వినయ్ విద్య విహార్ స్కూల్ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా దివాన్ చెరువుతో పాటు వివిధ గ్రామా లకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో హాజరై మురిపించే ముగ్గులను, రత్నాల రంగవల్లులను పోటీ పడి పెట్టారు. ముచ్చట గొలిపే ముత్యాల ముగ్గులు పోటీలను తిలకించేందుకు స్థానికులు, సుంకర ఫౌండేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో సేవ్ దా గర్ల్, అమ్మవారి ఆకృతి వంటి ముగ్గులు అందర్నీ ఆకట్టుకున్నాయి. వినయ్ విద్య విహార్ స్కూల్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని తమ పాఠశాల నందు ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. 40మంది మహిళలు ఎంతో ఉత్సాహంతో, వివిధ రకాల రంగ వల్లులతో అలరించరన్నారు. న్యాయ నిర్ణేతలుగా పద్మ, అనురాధ, రాజ్యలక్ష్మి, వినీల, డాక్టర్ హేమ నలిని వ్యవహరించినట్లు చెప్పారు.విజేతలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు 5వేలు, 3వేలు, 2 వేలు చొప్పున అందజేశారు. కన్సోలేషన్ బహుమతులుగా రూ. 1000/- చొప్పున ఒక్కొక్కరికి అందించారు. సుంకర ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు సుంకర వీరాస్వామి, ఎం.వి.రావు, హరిజి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ విష్ణు విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -భీమవరం: శ్రీ విష్ణు విద్యా సంస్థల్లో తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా జరిగాయి. విద్యా సంస్థల చైర్మన్ కె.వి.విష్ణురాజు సంక్రాంతి సంబరాల్లో పాల్గొని విద్యార్థులతో మమేకమయ్యారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యకలాపాలతో పాటు సంక్రాంతిని ప్రతిబింబించే రంగ వల్లులు, గొబ్బెమ్మలు, కోలాటం, భోగిపళ్ళు, వివిధ కళారూపకాలు, హరిదాసులు, కొమ్ము దాసర్లు, సోదమ్మ, పిట్టలదొర వేషధారణ, బొమ్మల కొలువు, రచ్చబండ, గ్రామ వాతావరణ అలంకరణ దేవాల యాలు, పాడిపంటలు, వ్యవసాయ సామాగ్రిలు వంటి కళారూపాలను ప్రదర్శన ఏర్పాటు చేశారు. సాంప్రదాయ ఆటలు అష్టా చమ్మా, మేక పులి, దాడి, చింతపిక్కలాటలు, వైకుంఠపాళీ వంటి మరుగునపడుతున్న ఆటలను మరొకసారి విద్యార్థులకు పరిచయం చేశారు. వీటోబుూపాటు సాంప్రదాయ పిండివంటలు సున్నుండలు, అరిసెలు, గారెలు, బొబ్బట్లు, చెగోడీలు, చెక్కలు, పొంగడాలు మొదలైన సంప్రదాయ వంటకాలు ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో పాత తరం తినుబండారాలు, బుర్రగుంజులు, జీళ్ళు, ఖర్జూరం, తేగలు, కొబ్బరి బొండాలు, కొబ్బరి పువ్వులు, చెఱకు రసం, రేగి పండ్లు వంటి వాటిని స్టాల్స్ గా ఏర్పాటు చేశారు. వివిధ నృత్య రూపకాలను ప్రదర్శించారు. వివిధ వేషధారణలతో సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జె.ప్రసాద్ రాజు, డైరెక్టర్ ఫర్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి. శ్రీనివాస్ రాజు, డి.జీ.ఎం రమేష్ రాజు, బి.వి.రాజు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఐ.ఆర్. కె.రాజు, విష్ణు స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్. బిందు విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు కలెక్టర్లకు ఆహ్వానం

విశాలాంధ్ర-భీమవరం టౌన్: శ్రీమావుళ్ళమ్మ జాతర ఉత్సవాలు సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కిఅమ్మవారి ఉత్సవ కమిటీ గురువారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ను కలసి.శ్రీమావుళ్ళమ్మ అమ్మవారు 61వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రమును అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా భీమవరం పట్టణం నడిబొడ్డున నెల రోజులు పాటు శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహెూత్సవాలు ఈనెల 13 నుండి ఫిబ్రవరి నెల 14 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయం దర్శనానికి స్థానిక భక్తులు కాకుండా,సుదీర్ఘ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు రావడం జరుగుతుందన్నారు.అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ కార్యవర్గం సభ్యులకు సూచించారు. ఆహ్వాన పత్రం అందజేసిన అమ్మవారి ఉత్సవ కమిటీ కార్యవర్గం అధ్యక్షులు రామాయణం గోవిందరావు, ఉపాధ్యక్షులు కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు),కార్యదర్శులు కొప్పుల రంగారావు, రామాయణం సత్య నారాయణ, నరహరిశెట్టి సూర్యనారాయణ,రామాయణం శ్రీని వాసరావు, ఆకుల సోమేశ్వరరావు,కొప్పుల రాంబాబు,మానే భాస్కరరావు, మానే తేజ సురేష్, కోశాధికారి రామాయణం సత్యనారాయణ పాల్గొన్నారు.

వీర పేరంటాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర-ఉండి : మండల పరిధిలోని వెలువరు గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ వీర పేరంటాలమ్మ హుండీ లెక్కింపు ఆలయ ఆవరణలో ఈవో సాగి రంగరాజు ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఆరు నెలల పది రోజులకు గాను భక్తులు సమర్పించిన వివిధ కానుకలు మొత్తం లెక్కించగా రూ.5 లక్షల 74,422 వచ్చినట్లు రంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ ఆలయావరణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. కలిగట్లు ఆలయ ఈవో ఎంఏ రామరాజు, మత్స్య పూరి ఆలయ ఈవో ఎం. రఘునాథ్, లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వర్రాజు, ముదునూరి రంగరాజు చైర్మన్, రెడ్డి, పోతురాజు, ఆలయ అర్చకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్లో దేవరపల్లి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-దేవరపల్లి: అండర్ 17 బాలికల క్రికెట్ పోటీలు మంగళ గిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో 200 రన్స్ దేవరపల్లి హైస్కూల్కి చెందిన ఓ సాహిత్యశ్రీ సాధించినట్లు పిఈటి ఓ నాగరాజు తెలిపారు. కే లీలసాయి ప్రసన్న బౌలింగ్లో ప్రతిభ చూపించి హైదరాబాదులో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందని నాగరాజు తెలిపారు. సాహితీ శ్రీ జైపూర్ భువనేశ్వర్లో జరిగే అండర్ 15 అసోసియేషన్ పోటీలో పాల్గొం టుందని తెలిపారు. అలాగే కే వర్షిని పి ప్రవీణ్ గత నెలలో కేరళలో జరి గిన సబ్ జూనియర్ పోటీలో పాల్గొన్నారన్నారు. కే వర్షిని గతంలో ఢిల్లీలో జరిగిన పోటీలో పాల్గొని రజిత పథకం సాధించిందని నాగరాజు తెలి పారు. వచ్చే నెలలో విజయవాడలో ఎస్ జి ఎఫ్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థులను హైస్కూల్ హెచ్ఎం బి శ్రీలక్ష్మి ఉపాధ్యా యులు పిఎంసి చైర్మన్ వేముల రాజు గ్రామస్తులు అభినందించారు.

తడిచెత్త, పొడి చెత్తపై అవగాహన

విశాలాంధ్ర-పెదపూడి : మండలంలోని చింతపల్లిలో మండల విస్తరణా ధికారి ఎంఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శి సాగర్ ఆధ్వర్యంలో తడిచెత్త, పొడి చెత్త పై గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కొల్లు లోవ కుమారి సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, వీర వెంకట సత్యనారాయణ (బాబు), గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.